# ఒక తుపాను బాధితుడి కథ

"నమస్కారం సార్!"

తలెత్తి చూశాను; రాసుకుంటున్నది ఆపి.

నల్లగా, పొడుగ్గా వున్నాడు. ఉంగరాల జుట్టు, ఉంగరాల వేళ్ళు, పొంగరాలాంటి కండల్తో నిండుగా వున్నాడు. గోల్డ్ రిమ్ముల కళ్ళద్దాలు, గోల్డు చెయిను వాచీ.

"యస్-" అన్నాను; అతన్ని గుర్తు పట్టలేదు.

"తమర్ని ఈ పన్లమీద అజమాయిషీకి నియమించేరని నిన్ననే విన్నాను సార్. తమరెప్పుడు జాయినయ్యారు సార్?"

"ఈ ఉదయం—"

నిజానికి నేను రాస్తున్నది, నేనిక్కడ జాయినైనట్టు ప్రభుత్వానికి రిపోర్టు. నేనే చిత్తు సాపు రాసుకుంటున్నాను అవసరమైన కాగితాలకి.

ఈ మహావిపత్తులో టైపిస్టు, స్టెనోలాంటి వాళ్ళ సేవల్ని కూడా వినియోగించుకోకుండా రాత్రింపగళ్లు పనిచెయ్యాలని కృతనిశ్చయంతో వచ్చాను. అలా పనిచెయ్యగలనని ప్రభుత్వంలో ఎవరికో తట్టింది. అందుకని నన్ను నియమించినట్టున్నారు.

"తుపానువల్ల మా ప్రాంతం బాగా దెబ్బతిన్నది సార్."

"ఐసీ—మీది........తాలూకా?"

"దొరగారు నన్ను గుర్తు పట్టలేదా సార్. నేను బసవరాజును! మనం విజయనగరం కాలేజిలో క్లాసుమేట్సుం!"

"ఐసీ—"

* * *

1944 లో విజయనగరం దగ్గిర నెల్లిమర్ల గ్రామానికి వరద ప్రమాదం సంభవించింది. అప్పుడు మేం విజయనగరంలో బి. ఎ. చదువుతున్నాం.

చంపావతి నది పొంగింది. రెండు రోజులు ఆ ఒడ్డూ ఈ ఒడ్డూ వరదేశా లయిపోయాయి. పగలూ, రాత్రీ కూడా గాలివాన, ఏరుపొంగి, వర్షానికి తడిసి నెల్లిమర్లలోను చుట్టూరా యాభై గ్రామాలలోను ఇళ్లు కొన్ని వేలు కూలిపోయాయి. ఎగువన వున్న అరణ్యాల్లో చెట్లు కూలి పోయి ఏట్లో కొట్టుకొచ్చాయి. అలా కొట్టుకెళ్ళి ట్రంక్ రోడ్డుమీద నాతవలస, సింగవరం వంతెన ఆర్చిల్లో చిక్కడిపోయి ప్రవాహ మార్గానికి అడ్డంపడ్డాయి. చెట్లూ మొక్కలూనూ ఏడుమైళ్ళ పొడుగుని మూడు ఫర్లాంగుల వెడల్పుని ఇరవయ్యేడుగుల లోతు చెరువు ఏర్పడి పోయింది. ఈ మధ్యని వున్న గ్రామాల్లో జనం పోయినవాళ్లు పోగా వున్నవాళ్లు ఇళ్లులేక వర్షానికి తడుస్తూ చెట్లూ చేమలూ పట్టేశారు. నాలుగోరోజున నీటి బలానికి తట్టుకోలేక మూడు ఫర్లాంగుల మేరకి రోడ్డూ వంతెనా కలిసి కోనాడ రేవుకి కొట్టుకుపోయాయి. ఇసక, రాయి, సిమ్మెంటూ ఏదీ కనబళ్ళేదు. ఇక్కడ వంతెన వుండేది, అన్న జ్ఞాపకం లేకుండా కొట్టుకుపోయింది.

ఆ ఉధృతం తగ్గేక వారం రోజులకి బాధితుల సహాయార్థం ధాన్యం, బట్టలు, ధనం అన్ని వివిధ సేవాసంస్థలు రాజకీయ పార్టీలు పోగుచేశాయి. అవన్నీ ప్రజాసేవకుడు కనకరాజు గారింట పోగు పడ్డాయి.

కనకరాజుగారి ఆధ్వర్యాన పేదలకు, బాధితులకు పోగుపడిన ధన ధాన్య వస్తు సముదాయం పంపిణీ జరిగింది.

ఐతే లారీలకొద్దీ వొచ్చిన ధాన్యంలోను, బేళ్ళకొద్దీ వొచ్చిన బట్టల్లోను మేలిరకం సరుకు కనకరాజుగారి బంధువర్గంలో ఒక్కడికీ మినహాయింపు లేకండా అందరికీ రెండేసేళ్ళపాటు తడుముకోకుండా సరిపోయేటంత సరుకు దాచుకున్నాకనే పంపకాలు జరిగేయి. ఆ సంగతి నాకు ఈ బసవరాజు ద్వారానే తెలిసింది.

ఎందుకంటే కనకరాజుగారి ఏకైక పుత్రుడు బసవరాజు.

* * *

బీభత్సంలోంచి లాభం సంపాదించుకో గలిగిన కనకరాజుగార్ని ఎదిగీ ఎదగని వయస్సులోని మాలాంటి కుర్రాళ్ళం ఏమీ చెయ్యలేక పోయాం.

కాలక్రమాన తెలిసింది; కొంపలు మునిగిపోయినా, కొంప లంటుకుపోయినా, ప్రభుత్వం అందజేసే సహాయం కొందరు వ్యక్తుల ద్వారానే బాధితులకి అందుతుందని, ఆ కొందరు వ్యక్తులు ఉచ్ఛం నీచం లేకండా ఇతరుల కష్టాలు ఆసరాగా తాము బాగుపడతారని లభ్యం అవుతున్న సరుకులకి ధరలు పెంచేసే బ్లాక్ మార్కెటీర్ల కన్నా వీరు పాపాత్ములని—

* * *

"మీరిక్కడేం చేస్తున్నారు?" అన్నాను; మిడిగుడ్లేసుకుని బసవ రాజును చూస్తూ కనకరాజుగారిని గుర్తు చేసుకుంటూ.

"నేను.... తాలూకా.... అధికారినండి."

"ఐసీ—కూర్చోండి."

చేతుల్లేని కుర్చీలో సహంమేరకి చేరబడకుండా కూచున్నాడు. "కూచున్నాడు" అనే కంటే పారిపోడానికి సిద్ధంగా మోకాళ్లు వొంచు కున్నాడంటే సరిపోతుంది.

ఈ అతి వినయం దేవి లక్షణమో విచారించాలనే కోర్కెకంటె నా క్లాస్మేట్ వ్యక్తిగత జీవితం గురించి భోగట్టా చెయ్యాలనే కోర్కె బలంగా కలిగింది నాకు.

"బిడ్డ లెందరు?"

"నలుగురు కూతుళ్ళూ ఇద్దరు కొడుకులూ సార్, ముగ్గురమ్మాయి లకి పెళ్ళిళ్లు చేశాను. పెద్దల్లుడు కలకత్తాలో ఓ ఫ్యాక్టరీ చీఫ్ అకౌంటెన్స

ఆఫీసరు- రెండో అల్లుడు ఆర్మీలో కమాండెంటు- మూడో అల్లుడు భిలాయ్‌లో చీఫ్ ఇంజనీరు- అబ్బాయిలు ఒక డమెరికాలోను ఒక డింగ్లాండులోనూ వున్నారు సార్, ఆఖరమ్మాయి పెళ్ళికున్నాది.''

"ఐసీ___''

"తమరు బావున్నారా సార్ ?''

నేను జవాబు చెప్పలేదు. "ఇల్లూ వాకిలీ పొలంపుట్రా ఏమైనా సంపాదించుకున్నారా ?''

"తమ దయవల్ల ఔనె సార్. వైజాగ్‌లో ఒక మేడ-'' అలా దండకం చదివాడు బసవరాజు.

"ఐసీ___'' అన్నాను.

* * *

కోట్ల కొలదీ రూపాయల ధనం, రకరకాల ఇతర సామగ్రి ఆర్తిలో వున్న వాళ్ళకోసం దేశం నలుమూలల నుంచి వచ్చిపడు తున్నాయి.

వీటి పంపిణీకి నాకు ప్రభుత్వ యంత్రాంగం నుంచి మిక్కిలి నిజాయితీపరులు చాలా అవసరం. నే నొక్కణ్ణి మడికట్టుకు కూర్చుంటే చాలదు.

వేరుపురుగు చేరి వృక్షంబు చెరచును-

కాగితం తీసుకుని కలెక్టర్ పేర ఉత్తరం రాశాను. "బసవ రాజును వెంటనే మరో చోటుకి బదిలీ చెయ్య''మని.

"నేను వెళ్ళొస్తాను సార్; తమరు బిజీగా వున్నట్టున్నారు'' అని లేచాడు బసవరాజు.

ప్రస్తుతం బసవరాజు లందర్నీ తుపాను బాధితులుగా చెయ్య వలసిన బాధ్యత నాది !

నాకు జయం కలుగుగాక !

(10-12-77)